సాక్షి చిత్తూరు

ఆదివారం । 23 । జూలై । 2023



వరసిద్ధుని సేవలో ప్రముఖులు

కాణిపాకం వినాయకస్వామిని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్‌సుందర్, కర్ణాటక మంత్రి సుధాకర్ దర్శించుకున్నారు.

- 8లో



ఇంటింటా టీకా సర్వే పరిశీలన

జిల్లాలో చేపట్టిన టీకా సర్వేను కేంద్రం అబ్జర్వర్ డీజే బోరా శనివారం పరిశీలించారు. పిల్లలకు టీకాలు వేయించాలని ఆదేశించారు.

- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	33	26
తిరుపతి	33	27
తిరుమల	29	22
గూడూరు	34	27
నగరి	34	27

31న వరసిద్ధుని హుండీ లెక్కింపు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈ నెల 31వ తేదీన హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు శనివారం తెలిపారు.

పుస్తకమస్తు!

ఆకర్షణీయ చిత్రాలు.. కార్టూన్లు.. నాణ్యమైన పేపర్.. రంగు రంగుల ఆయిల్ ప్రింటింగ్‌తో ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను ముద్రించింది. బడి గంట కొట్టిన రోజే పిల్లలకు పంపిణీ చేసింది. విద్యాసంస్కరణల్లో భాగంగా సెమిస్టర్ల వారీగా సబ్జెక్టులకు అనుగుణంగా బుక్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలో సెమిస్టర్–2 పుస్తకాలను సైతం పకడ్బందీగా విద్యార్థులకు అందజేసింది.

- ఉమ్మడి జిల్లా పరిధిలో పక్కాగా సెమిస్టర్–2 బుక్స్ పంపిణీ
- సర్కారు బడుల్లోని విద్యార్థులందరికీ అందేలా చర్యలు
- ప్రక్రియను పర్యవేక్షించిన ఉన్నతాధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



తిరుపతి మండలం దుర్గసముద్రం జెడ్పీ హైస్కూల్‌లో పుస్తకాలు చూపుతున్న విద్యార్థులు



చౌడేపల్లి మండలం ఏ.కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌లో సెమిస్టర్ 2 పుస్తకాలతో విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం విద్యారంగంలో పలు సంస్కరణలు ప్రవేశపెట్టింది. అందులో భాగంగా నూతన పాఠ్యపుస్తకాలను కొత్త హంగులతో సిద్ధం చేసింది. విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు పుస్తకాల బరువు తగ్గించేందుకు సెమిస్టర్ల వారీగా పుస్తకాలను తీర్చిదిద్దింది. ప్రస్తుతం విద్యార్థులకు రెండు సెమిస్టర్లను అందించింది. 1 నుంచి 10వ తరగతులకు లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ కలిపి 113 టైటిల్స్ ముద్రించింది. ఈ మేరకు శనివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పకడ్బందీగా రెండో సెమిస్టర్ పుస్తకాలను 6 నుంచి 9 వ తరగతి విద్యార్థులకు అందజేసినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 6,65,467 పాఠ్యపుస్తకాలు, 2,44,870 వర్క్‌బుక్స్ మొత్తం 9,10,337 సెమిస్టర్ 2 పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు వివరించారు. మొత్తం ప్రక్రియను చిత్తూరు కలెక్టర్ షణ్మోహన్, తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, చిత్తూరు డీఈఓ విజయేంద్రరావు, తిరుపతి డీఈఓ శేఖర్ పర్యవేక్షించారు. సకాలంలో పుస్తకాలు అందించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివరణలతో వీడియోలు

విద్యార్థులకు అందించిన సబ్జెక్టు పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన వీడియో వివరణలను అందుబాటులో ఉంచారు. పుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్స్ ద్వారా స్కాన్స్ చేసిన వెంటనే సంబంధిత విషయానికి సంబంధించిన అదనపు సమాచారంతో కూడిన వీడియోలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టారు.

పకడ్బందీగా పంపిణీ



పకడ్బందీగా సెమిస్టర్–2 పుస్తకాలను పంపిణీ చేశాం. సర్కారు బడుల్లోని ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకం అందేలా చర్యలు చేపట్టాం. మొత్తం 31 మండలాల పరిధిలో 4,45,310 పుస్తకాలను అందించాం. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓలను ఆదేశించాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి. చక్కగా చదువుకుని ఉన్నతంగా రాణించాలి.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు.

పరిశుభ్రంగా పంచాయతీలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పంచాయతీలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని డీపీఓ లక్ష్మి ఆదేశించారు. శనివారం ఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తొలిసారిగా పంచాయతీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో మరుగుదొడ్లు, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం, పారిశుద్ధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కేంద్ర బృందం ఆగస్టులో జిల్లావ్యాప్తంగా పర్యటించి పరిశుభ్రమైన పంచాయతీలను అవార్డులకు ఎంపిక చేస్తుందని వెల్లడించారు. ఈ మేరకు కార్యదర్శులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

27న ధర్మకర్తలి మండలి సమావేశం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ధర్మకర్త మండలి సమావేశాన్ని ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు శనివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

కిక్కిరిసిన కాణిపాకం



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలు, కంపార్ట్‌మెంట్‌లు నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈఓ వెంకటేశు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

26న నగరిలో జాబ్ మేళా

నగరి : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కాల్‌మన్ సర్వీసెస్ సెంటర్ చెన్నై ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టెలీకాలర్ పోస్టులకు నిర్వహించే ఇంటర్వ్యూకు ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు, ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న వారు అర్హులన్నారు. నెలకు రూ.13 వేల నుంచి రూ. 15వేల వరకు జీతం, ఉచిత వసతి సదుపాయం ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు మార్కుల లిస్ట్ జిరాక్స్, ఒరిజినల్ ఐడీ ప్రూఫ్‌తో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 9884787264, 9884304026 నంబర్లలో సంప్రదించాలని కోరారు

కంప్యూటర్ ప్రొఫెషియన్సీ పరీక్ష నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్.

చిత్తూరు కలెక్టరేట్ : కంప్యూటర్ ప్రొఫెషియన్సీ పరీక్ష నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్ సమీక్షించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన కంప్యూటర్ ప్రొఫెషియెన్సీ పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ లోని జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ సహాయకుల పోస్టుల భర్తీకి గ్రూప్–4 మెయిన్స్‌లో ఎంపికైన అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. చిత్తూరు సమీపంలోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మరియు మేనేజ్‌మెంట్ స్టడీస్ (సీతమ్స్ కాలేజీ)లో పరీక్ష నిర్వహణకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఈఓ విజయేంద్రరావు, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, ఆర్డీఓ రేణుక పాల్గొన్నారు.

దోమల కట్టడితో వ్యాధుల నివారణ

చిత్తూరు రూరల్: దోమలను కట్టడి చేస్తేనే వ్యాధులను నివారణ సాధ్యమని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి తెలిపారు. డెంగీ మాసోత్సవంలో భాగంగా శనివారం చిత్తూరులోని భరత్‌నగర్‌లో ఆమె పర్యటించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను వెంటనే శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. నీటి నిల్వల్లో దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, విష జ్వరాలు ప్రబలే ప్రమాదముందని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారిని శనివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వారిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్ సుందర్, కర్ణాటక మంత్రి సుధాకర్ ఉన్నారు. వీరికి ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఆర్డీఓ రేణుక, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, తహసీల్దార్ సుశీల, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కర్ణాటక మంత్రికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

కేజీఎఫ్(కర్ణాటక): కర్ణాటకలో కోలారు జిల్లా కేజీఎఫ్ పట్టణంలో బ్యాంకుల వద్ద పొంచి ఉండి డబ్బులు దొంగతనం చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను శనివారం అండర్‌సన్‌పేట పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలు, రూ.4 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన జక్రయ్య (43), రమేష్(50), నెల్లూరు జిల్లాకు చెందిన ఆకుల కుమార్(32) అరెస్టయిన నిందితులు. వీరు బ్యాంకుల వద్ద దొంగతనాలు చేయాలని పట్టణానికి వచ్చారని విచారణలో తెలిసింది. బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసుకుని ద్విచక్ర వాహనాల్లో నగదు పెట్టుకెళ్లేవారిని వీరు దృష్టి మళ్లించి డబ్బు దోచుకునేవారని పోలీసులు తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి అరెస్టు చేశారు.

ఆస్తుల ధ్వంసంలో ఆరుగురిపై కేసు

రామకుప్పం: మండలంలోని ఆవులకుప్పంలో రవి అనే రైతు హత్యకు గురైన విషయం తెలిసిందే. రవి హత్యతో అతడి బంధువులు ఆగ్రహం పట్టలేక నిందితుల ఇళ్లు, పశువుల షెడ్లుతో పాటు ఇతర ఆస్తులను ధ్వంసం చేశారు. దీనిపై హత్యకేసులో నిందితుడు ప్రశాంత్ రెడ్డి, అతడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై 324,436,506,34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. అందులో జయరాము, బాలాజీ, శ్రీకాంత్‌ను శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

గంజాయి స్మగ్లర్ అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ చంద్రశేఖర్

పలమనేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గంజాయి స్మగ్లర్ చింతల రమేష్‌ను గంటావూరు ఫ్లైఓవర్ వద్ద శనివారం పలమనేరు పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ మదనపల్లెకు చెందిన వెంకటేశ్వర్లు, భాగ్యమ్మ దంపతులు కొన్నాళ్లుగా రమేష్ దగ్గర గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నారన్నారు. ఈ క్రమంలో వీరి లావాదేవీలపై నిఘా ఉంచి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. రమేష్ నుంచి 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో సంబంధం ఉన్న మరో ఆరుగురు నిందితులను త్వరలోనే అరెస్ట్ చేయనున్నట్లు వివరించారు. దాడిలో ఎస్‌ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లారీని ఢీకొని వ్యక్తి దుర్మరణం

గంగాధరనెల్లూరు : చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారిపై ఎట్టేరి 9 వద్ద శనివారం ఆగి ఉన్న లారీని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. బంగారుపాళ్యం మండలం తమ్మిగానిపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్(30) ద్విచక్రవాహనంలో చిత్తూరు వైపుగా స్వగ్రామానికి బయలుదేరాడు. వర్షం కురుస్తుండడంతో రోడ్డు ఆగి ఉన్న లారీని గుర్తించకుండా వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రవీణ్‌కుమార్ మృతదేహం

ఇంటింటా టీకా సర్వే పరిశీలన

చిత్తూరు రూరల్: నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటా టీకా సర్వేను శనివారం కేంద్ర యూవిన్ ఆఫ్ అబ్జర్వర్ డాక్టర్ డీజే బోరా పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. టీకా వేయించిని పిల్లల వివరాల సేకరణపై ఆరా తీశారు. యాప్‌లో వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. వందశాతం పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు అందించాలని, శిశుమరణాల నివారణకు కృషిచేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి, డీఐఓ రవిరాజు, డీపీఎంఓ హర్షవర్ధన్, పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి



ఫైజుల్లా (ఫైల్)

గంగవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు శనివారం మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని గంద్రాజుపల్లె పంచాయతీ పెద్దఉగిణి గ్రామానికి చెందిన ఫైజుల్లా (18) ఈ నెల 20వ తేదీన పొన్నమాకులపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఎమ్మెల్యే వెంకటేగౌడ చొరవతో క్షతగాత్రుడికి పలమనేరు, కుప్పం పీఈఎస్, బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సలందించారు. అయినప్పటికీ ఫైజుల్లా కోలుకునే అవకాశం లేదని వైద్యులు తేల్చిచెప్పడంతో కుటుంబీకులు బెంగళూరు నుంచి స్వగ్రామానికి తీసుకువస్తుంగా మార్గం మధ్యలో మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని ..

చిత్తూరు అర్బన్: నగరంలో శుక్రవారం రాత్రి రోడ్డు డివైడర్‌ను ఢీకొని తేజస్ (19) అనే యువకుడు మృతి చెందాడు. శ్రీనగర్ కాలనీకి చెందిన తేజస్ ద్విచక్ర వాహనంలో గిరింపేట నుంచి చిత్తూరుకు వస్తుండగా అదుపుతప్పి అశోకపురం వద్ద డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన తేజస్‌ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు.

కర్ణాటక మద్యం పట్టివేత : ఒకరి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న అధికారులు

చిత్తూరు రూరల్: బంగారుపాళ్యం మండలంలో శనివారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించి 30 కర్ణాటక మద్యం ప్యాకెట్లు సీజ్ చేశారు. టేకుమందకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి మద్యం రవాణాకు వినియోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్ బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యంగౌడ్ పాల్గొన్నారు.